నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం | సెప్టెంబర్ 28, 2023 | www.navatelangana.com

తాగునీరు రావటం లేదు



- ఖాళీ బిందెలతో బతుకమ్మ ఆడి నిరసన

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని 9వ వార్డుతో పాటు గ్రామంలో తాగునీరు రావటం లేదని మహిళలు, పురుషులు రోడ్డుపై ఖాళీ బిందెలతో బతుకమ్మ ఆడి బుధవారం నిరసన తెలిపారు. గ్రామపంచాయతీ పాలకవర్గం, అధికారులు వెంటనే స్పందించి తాగునీటిని అందేలా కృషి చేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి క్రాంతిని ఘటనపై వివరణ కోరగా.. గత రెండు రోజుల నుంచి గ్రామానికి సరఫరా చేసే మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతు కావడంతో రెండు రోజులు నీరు రాలేదని, బుధవారం నీరు సరఫరా అయిందని తెలిపారు.

డీజే శబ్దానికి గుండెపోటు



- యువకుడు మృతి

నవతెలంగాణ-రామారెడ్డి

డీజే శబ్దంతో గుండె నొప్పి వచ్చి యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని రెడ్డిపేటలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొండ నరేష్ (28) గతంలో గల్ఫ్ దేశాలకు బతుకుదెరువు కోసం వెళ్లాడు. తిరిగి వచ్చిన తర్వాత గుండె నొప్పి రావడంతో, శాస్త్ర చికిత్స నిర్వహించారు. బుధవారం గ్రామంలో గణేష్ నిమజ్జనం జరుగుతుండగా, శోభయాత్ర చూడడానికి వెళ్లాడు. అక్కడ డీజే సౌండ్‌తో అక్కడికక్కడే కుప్పకూలిపోవడంతో చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మరణించాడని వైద్యులు ధ్రువీకరించినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

ఓటరు జాబితా పక్కాగా ఉండాలి

- జాబితా పరిశీలకులు క్రిస్టినా జెడ్.చోంగ్తు
- కలెక్టర్‌తో కలిసి పోలింగ్ కేంద్రాల సందర్శన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కలిగి ఉండేలా తుది ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలని ఓటరు జాబితా పరిశీలకులు, రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి క్రిస్టినా జడ్‌చోంగ్తూ సూచించారు. పోలింగ్ సమయంలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా సాఫీగా ఎన్నికల ప్రక్రియ జరిగేలా ఓటరు జాబితా పకడ్బందీగా ఉండాలన్నారు. బుధవారం ఆమె కలెక్టర్ రాజీవ్‌గాంధీ హను మంతుతో కలిసి నిజామాబాద్ రూరల్ సెగ్మెంట్ పరిధిలోని జక్రాన్‌పల్లి మండలం పడ్కల్, అర్బన్ సెగ్మెంట్‌లోని అర్సపల్లి, ఆర్మూర్ సెగ్మెంట్లోని మాక్లూర్ మండలం గుత్ప, బాల్కొండ సెగ్మెంట్లోని పోచంపాడ్, బోధన్ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలోని శక్కర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు కోసం వచ్చిన దరఖాస్తులు, మార్పులు-చేర్పులు కోరుతూ దాఖలైన దరఖాస్తులను పరిశీలించి, వాటి వివరాలను సంబంధిత రిజిస్టర్లలో నమోదు చేసిన తీరును నిశితంగా పరిశీలన జరిపారు. ఆన్లైన్, ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులు ఎన్ని, వాటిని ఎలా పరిష్కరిస్తున్నారు తదితర వివరాలను బీ.ఎల్.ఓలకు అడిగి తెలుసుకున్నారు. ఇతర ప్రాంతాల నుండి కొత్తగా వలస వచ్చిన వారికి సంబంధించి కొత్త ఓటరుగా పేరు నమోదు చేసే ముందు తప్పనిసరిగా వారి పాత నివాస ప్రాంతంలో ఓటరు జాబితాలో పేరు ఉందా లేదా అన్నది నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. డూప్లికేషన్ ఓటర్లకు సంబంధించి కూడా రెండు చోట్ల నిర్ధారణ చేసుకుని, ఏదైనా ఒక ప్రాంతంలో తప్పక ఓటరు పేరు ఉండేలా చూసుకోవాలని హితవు పలికారు. ఇతర ప్రాంతానికి వలస వెళ్లిన వారి గురించి సంబంధిత పోలింగ్ కేంద్రం అధికారులకు తెలియజేయాలన్నారు. ఓటరు జాబితాలో పలువురి ఫోటోలు లేకపోవడాన్ని గమనించిన పరిశీలకులు క్రిస్టినా, ఇంకను సమయం ఉన్నందున సదరు ఓటర్ల ఫోటోలు సేకరించి అప్లోడ్ చేయాలని సూచించారు. మృతి చెందిన ఓటర్ల పేర్లను జాబితా నుండి తొలగించే ముందు కుటుంబ సభ్యుల ద్వారా నిర్ధారణ చేసుకోవాలని, మరణ ధ్రువీకరణ పత్రం లేకపోయినా సంబంధిత మున్సిపల్, గ్రామ పంచాయతీ నుండి సేకరించి ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేయాలని అన్నారు. తుది ఓటరు జాబితా రూపకల్పనకు సంబంధించిన నియమ, నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఏ విషయంలోనైనా అనుమానాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పొరపాట్లకు ఆస్కారం కల్పించకూడదని సూచించారు. అబ్జర్వర్ వెంట అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్ తదితరులు ఉన్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న పరిశీలకులు

పండ్లతోటల పెంపకంపై దృష్టి సారించాలి

- చేపల పెంపకంపై ఆసక్తి చూపాలి
- ప్రత్యామ్నాయ పంటలతో అధిక లాభాలు
- డిఆర్‌డిఏ పిడి సాయన్న

నవతెలంగాణ-లింగంపేట్

రైతులు పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలని, చేపల పెంపకంపై ఆసక్తి చూపాలని డిఆర్‌డిఏ పిడి సాయన్న అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి, లింగంపేట్, గాంధారి, తాడ్వాయి, రాజంపేట్ మండలాలకు చెందిన ఏపీఓలకు ఉపాధి హామీ సిబ్బందికి క్షేత్ర సహాయకులకు ప్రత్యామ్నాయ పంటలు, పండ్ల తోటల పెంపకంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి గ్రామపంచాయతీలో క్షేత్ర సహాయకులు 15 ఎకరాలపైగా పండ్ల తోటలు పెంచేవిధంగా పనిచేయాలన్నారు. రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పండ్లతోటల పెంపకంపై చూపేవిధంగా పని చేయాలన్నారు. పొలం గట్లపైన కొబ్బరి, మామిడి, మొక్కలు నాటే విధంగా చూడాలన్నారు. అదేవిధంగా జామ, దానిమ్మ, ఉసిరి మొక్కలు పెంచేందుకు రైతులు ముందుకు వచ్చినట్లయితే మొక్కలు నాటే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. రైతులు దీర్ఘకాలికంగా వరి పంటనే సాగు చేస్తున్నారని వరికి బదులు ప్రత్యామ్నాయ పంటల వైపు పామాయిల్, హార్టికల్చర్ పంటలవైపు ఆసక్తి చూపాలని అన్నారు. పక్క పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చునని అన్నారు. రానున్న రోజుల్లో జిల్లావ్యాప్తంగా పండ్ల తోటలు అధికంగా కనిపించాలని సూచించారు ప్రతిరోజు గ్రామ పంచాయతీ పరిధిలో 50 కూలీలకు పని కల్పించాలన్నారు. అదేవిధంగా ఉపాధి పథకం కింద చేపల చెరువు ఏర్పాటు చేసుకోవాలని, దీని ద్వారా లాభాలు అధికంగా వస్తాయన్నారు. కొత్తగా పనులను గుర్తించాలని క్షేత్రసహాయకులకు సూచించారు. ఇటీవల గిరిజనులకు ప్రభుత్వం పంపిణీ చేసిన పోడు భూముల్లో ఐదు ఎకరాల్లో పండ్ల తోటలు పెంచే విధంగా గిరిజనులకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, ఏపీవో తులసిరామ్, ఆయా మండలాల ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ సాయన్న

దళిత బంధు ప్రతి ఒక్కరికీ అందించాలి

నవతెలంగాణ-మద్నూర్

దళిత బంధు ప్రతి ఒక్కరికీ అందించాలని డోంగ్లి మండలంలోని లింబూరు గ్రామస్తులు గ్రామ పంచాయతీ ఎదుట ఆందోళన చేపట్టారు. బుధవారం నాటికి ఆందోళన మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా దళితులు మాట్లాడుతూ.. ప్రభుత్వం పథకం ఏర్పాటు చేసింది కొందరి కోసం కాదని ప్రతి దళితునికి దళిత బంధు ఇవ్వడానికే పథకం తీసుకొచ్చిందని తెలిపారు. ప్రతి ఒక్కరికి దళితబంధు మంజూరు చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మారుతి, రాహుల్, నీలు, సుభాష్, లింగురాన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు ఓట్లు పడితే, రాజకీయ సన్యాసం తీసుకుంటారా?

- జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

కామారెడ్డి నియోజకవర్గంలో సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర రావు పోటీ చేస్తుండని తెలవగానే, బిఆర్ఎస్ నాయకులు అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని విస్మరిస్తున్నారని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గం, బిఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రామాల్లో ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నామని ప్రకటించుకోవటం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. 'మీరు ప్రకటించుకున్న ఏకగ్రీవ గ్రామాల్లో కాంగ్రెస్‌తో పాటు, ఇతర పార్టీలకు, ఆ గ్రామాల ప్రజలు ఓట్లు వేస్తే, మాచారెడ్డి, రామారెడ్డి మండలంలో పెద్దమనిషిగా చలామణి అవుతూ, మంచి భవిష్యత్తు ఉన్న నేతగా ఎదుగుతున్న సమయమిది, ఇలాంటి రాజకీయాలు మీకు సరికాదు. ఒకవేళ మీరు ఏకగ్రీవం చేసిన గ్రామాల్లో, ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయకపోతే, తన పదవికి, రాజకీయానికి రాజీనామా చేసి సన్యాసం తీసుకుంటా, ఒకవేళ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేస్తే మీరు రాజకీయ సన్యాసం తీసుకుంటారా?' అని సవాల్ విసిరారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెబాట

నవతెలంగాణ-ఎడపల్లి

జిల్లా వ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె చేపట్టబోతున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు వినతిపత్రాన్ని అందజేశారు. సెప్టెంబర్ 28 నుండి మధ్యాహ్నం భోజనం కార్మికులమందరం సమ్మె బాటలో ఉంటామని వినతిపత్రంలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకు బకాయిలు పెండింగ్ వేతనాలు లక్షల రూపాయలు రావాల్సి ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయడంలో విఫలమైందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎడపల్లి మండలాధ్యక్షురాలు దేరాడీ లక్ష్మి, సాయమ్మ బట్టు రాజు, ఆయా గ్రామాల మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

డాక్టర్ బండివార్ విజయ్ సేవలు ఐకమత్యానికి బలం



విజయ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-మద్నూర్

డాక్టర్ బండివార్ విజయ్ మున్నూరు కాపు కులస్తులకు ఏకం చేయడానికి అందిస్తున్న సేవలు మున్నూరు కాపు ఐక్యమత్యానికి ఎంతో బలం చేకూరుతుందని మున్నూర్ కాపు యువకులు అన్నారు. బుధవారం ఆ యువకులు డాక్టర్ ఇంటికి వెళ్లి శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. సన్మాన కార్యక్రమంలో మున్నూరు కాపు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చిన్న తక్కడపల్లిలో పశువైద్య శిబిరం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

బిచ్కుంద వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని చిన్నతక్కడ్‌పల్లి గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ నాగనాథ్ పటేల్, సర్పంచ్ లక్ష్మి అశోక్ పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పశువులకు గాలికుంటు నివారణ తదితర వ్యాధులకు చికిత్స నిర్వహించారు. ఉచిత పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ సూచించారు. కార్యక్రమంలో చైర్మన్‌తో పాటు మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సుపాటిల్, పశువైద్య అధికారి డాక్టర్ పండరినాథ్, ఆఫీస్ సబార్డినేట్ సురేష్, గోపాలమిత్ర రవి, బాబు పాటిల్, రాంగొండ, మార్కెట్ కమిటీ కార్యదర్శి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న దృశ్యం

ఓటరు జాబితాలో తప్పొప్పులు సరిచేయాలి

- అదనపు కలెక్టర్ చంద్ర మోహన్

నవతెలంగాణ-తాడ్వాయి

ఓటరు జాబితాలో తప్పొప్పులు సరిచేసి అర్హులైన ఓటర్లను నమోదు చేసి మరింత మెరుగ్గా, పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించడానికే నిర్మాణాత్మకమైన సూచనలు, సలహాలు తీసుకోవడానికే గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా రూపకల్పనపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటరుకు సర్వోన్నత స్థానముందని, అర్హులైన ప్రతి వ్యక్తి ఓటరుగా నమోదు కావడంతో పాటు, సరైన విచారణ జరపకుండా ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుండి తొలగించరాదని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలిచ్చిందని అన్నారు. అందులో భాగంగా చేపట్టిన సెకండ్ సమ్మరి రివిజన్ చేపట్టడం జరిగిందని, జులై 16 నుండి ఈ నెల 19 వరకు నూతన ఓటరు నమోదు, సవరణల కొరకు ఫారం-6,7,8 ద్వారా దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని, జుల్ 16 నుండి ఈ నెల 19 వరకు వచ్చిన 49,424 క్లెయిమ్స్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తున్నామన్నారు. అన్ని క్లైమ్స్‌ను నేటి వరకు పరిష్కరించడంతో పాటు చిరునామా మార్పు, మరణించిన వారి ఓట్ల తొలగింపు, రెండు ఆ పై ఉన్న ఎపిక్ కార్డులు కలిగిన వారి వివరాల తొలగింపు, ఒకే కుటుంబానికి చెందిన వారు అందరు ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండేలా తుది జాబితా రూపొందించి ఎన్నికల సంఘం అనుమతి తీసుకొని అక్టోబర్ 4 న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామని, ఆ జాబితానే ఎన్నికల నిర్వహణకు ప్రామాణికమని అన్నారు. జిల్లాలో 1,47,780 నాన్ స్టాండర్డ్ ఎపిక్ కార్డుల స్థానంలో నూతనంగా వచ్చిన స్టాండర్డ్ ఎపిక కార్డుల ఇంటిమేషన్ లేఖలను బి.ఎల్.ఓల ద్వారా సంబంధితులకు చేరవేశామని చంద్ర మోహన్ తెలిపారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈ.వి.ఎం. వివిప్యాట్‌ల ద్వారా డమ్మీ ఓట్లు వేయించి ఓటు వేసే విధానంపై అవగాహన కలిగించారు. ఇంవరకు 6,544 మంది కేంద్రాన్ని సందర్శించి మాక్ పోలింగ్ చేశారన్నారు. అదేవిధంగా సంచార వాహనాల ద్వారా జిల్లాలోని మూడు నియోజకవర్గాలలోని 348 పోలింగ్ బూతులు కవర్ చేసి మాక్ పోలింగ్ పై అవగాహన కలిగించామన్నారు. ఓటరు జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాల నివృత్తి కోసం నేడు కామారెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో బి.ఎల్.ఓ.లు, సూపర్వైజర్లతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం సి.పిఓ. ఆధ్వర్యంలో ఏర్పాటైన మ్యాన్ పవర్ కమిటీలో ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో ఆపరేటర్‌గా విధములు నిర్వహిస్తున్న తీరును పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు జూకంటి ప్రభాకర్, మదన్‌లాల్ జాదవ్, కాసిం అలీ, బట్టేనికి బాలరాజు, మహమ్మద్ జఫ్పార్ ఖాన్, అనిల్ కుమార్, సిపిఐ రాజారాం, ఎలక్షన్ సూపరింటెండెంట్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు..

స్వాతంత్రోద్యమ సాధనలో, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలంలో కొండ లక్ష్మణ్ బాపూజీ కృషి చేశారని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి పట్టణంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో కొండ లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఉద్యమకారుడిగా, ప్రజాస్వామిక వాదిగా, పీడిత ప్రజల పక్షపాతిగా, నిబద్ధత కలిగిన గొప్ప రాజకీయ నాయకుడిగా బాపూజీని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి శ్రీనివాస్, బీసీ సంఘాల నాయకులు శివ రాములు, ఎంజి వేణుగోపాల్ గౌడ్, రాజయ్య, మల్లయ్య, శ్రీహరి, పోచవ్వ, అధికారులు పాల్గొన్నారు.

కామ్రేడ్ ముఖ్తార్ పాషాకు నివాళి

నవతెలంగాణ-బోధన్

ఐఎఫ్టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ముఖ్తార్ పాషాకు బుధవారం బోధన్ పట్టణంలో ఐఎఫ్టీయూ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు పుట్ట వరదయ్య మాట్లాడుతూ కామ్రేడ్ ముఖ్తార్ పాష కార్మిక వర్గ పక్షపాతి అని కొనియాడారు. జీవితాంతం కార్మికుల హక్కుల కోసం, సంక్షేమం కోసం అవిశ్రాంతంగా పోరాడాడని పేర్కొన్నారు. కార్మిక సమస్యలను అధ్యయనం చేయడం పోరాటాలను రూపొందించడంలో కామ్రేడ్ పాషకు సాటి ఎవరూ లేరని అన్నారు. రెక్కలు తప్ప ఆస్తులు లేని కార్మిక లోకం సంఘటిత పోరాటాలు చేయాలని పాషన్న సూచించారని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను దేశంలో అమలు చేస్తున్నారని వరదయ్య అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తున్నారని విమర్శించారు. పోరాడి సాధించుకున్న హక్కులు హరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటిత పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోవాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. కార్మిక రాజ్యం స్థాపన ద్వారానే కామ్రేడ్ పాషన్నకు అర్పించే నిజమైన నివాళి అని అన్నార తదితరులు పాల్గొన్నారు.

30లోగా 100శాతం వసూలు చేపట్టాలి

- జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మనుచౌదరి

నవతెలంగాణ-తాడ్వాయి

ఇంటి పన్నులు ఈ నెల 30లోగా 100శాతం వసూలు చేపట్టాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మనుచౌదరి అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండల స్థాయి పంచాయతీ అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. గ్రామాల్లోని పోలింగ్ బూతుల్లో ర్యాంపులు, తాగునీరు, మరుగుదొడ్లు, వీల్ చైర్ ఏర్పాటు చేయాలని కోరారు. 2019 పల్లె ప్రగతి తర్వాత గ్రామపంచాయతీలలో తాగునీటి, వీధిలైట్ల విద్యుత్ బిల్లులను చెల్లించే విధంగా చూడాలన్నారు. గ్రామాల్లో అవసరం లేని చోట విద్యుత్ మీటర్లను తొలగించాలన్నారు. వాటి వివరాలను ఎంపీవోలు లేఖ ద్వారా ఎఈకి సమాచారం తెలుపాలన్నారు. గాంధారి, లింగంపేట్, ఎల్లారెడ్డి మండలాల్లో విద్యుత్ బకాయిలు అధికంగా ఉన్నాయని తెలిపారు. దశలవారీగా విద్యుత్ బకాయిలు చెల్లించాలని పేర్కొన్నారు. సమావేశంలో డిపిఓ శ్రీనివాసరావు, డిఎల్‌పిలు సురేందర్, శ్రీనివాస్, ఎంపీవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

రుణమాఫీ అయినా..

బ్యాంకులో డబ్బులు రాకపోవడంతో ధర్నా

నవతెలంగాణ-రెంజల్

తెలంగాణ ప్రభుత్వం లక్ష రూపాయల లోపు రుణాలు తీసుకున్న రైతుల రుణమాఫీ వర్తిస్తుందని చెప్పి, ఇంతవరకు బ్యాంకులో డబ్బులు రాకపోవడం శోచనీయమని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని దూపల్లి బరోడా బ్యాంక్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితమైందని, లక్షలు రైతులందరికీ రుణమాఫీ వర్తింప చేస్తామని ప్రకటించి కేవలం 30 శాతం రైతులకు మాత్రమే వర్తించిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ అయిన రైతుల డబ్బులు ఇంతవరకు ఖాతాలో పడకపోవడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రైతుల రుణమాఫీ డబ్బులను రైతు ఖాతాలో జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు సుదర్శన్ యాదవ్, సాయిరెడ్డి, లింగన్న యాదవ్, స్థానిక రైతులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతులు

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణవాది, స్వాతంత్ర్య పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 108 జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా జయంతి ఉత్సవాలు నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్మెన్ దాదన్నగారి విఠల్‌రావు, రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ ఆకుల లలిత, అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, బీ.సి, పద్మశాలి కుల సంఘాల ప్రతినిధులు, తదితరులు వినాయకనగర్ లోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పి చైర్మన్ మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటైతే ఈ ప్రాంత ప్రజల జీవితాలు బాగుపడతాయనే భావనతో తన తుది శ్వాస వరకు కూడా ప్రత్యేక రాష్ట్ర సాధనకై అంకితభావం, నిజాయితీగా కృషి చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని ప్రశంసించారు. కేవలం తెలంగాణ ఉద్యమంలోనే కాకుండా భారత స్వాతంత్ర్య పోరాటంలోనూ పాల్గొన్నారని, చట్టసభల్లో గళమెత్తి తన పదవులను తృణప్రాయంగా వదులుకున్న త్యాగశీలి అని గుర్తు చేశారు. ఆ మహనీయుడి గురించి ఎంత పొగిడినా తక్కువే అవుతుందని, తెలంగాణ సమాజంలో జన్మించిన ఆణిముత్యం కొండా లక్ష్మణ్ బాపూజీ అని అభివర్ణించారు. ఆయన త్యాగాలు, పోరాట పటిమను నేటి తరానికి తెలియజేసేలా తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా జయంతి ఉత్సవాలను నిర్వహించడం ఎంతో సంతోషకరమని అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల సాధనకు ఐకమత్యంతో పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రమేష్, పద్మశాలి, బీసీ కుల సంఘాల నాయకులు నరాల సుధాకర్, వెంకట నర్సయ్య పులగం హనుమాండ్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార రంగంలో రాణించాలి

- మాజీ మంత్రి షబ్బీర్ అలీ



మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

నవతెలంగాణ-భిక్కనూర్

వ్యాపార రంగాల్లో నిరుద్యోగులు రాణించాలని మాజీ మంత్రి షబ్బీర్ అలీ తెలిపారు. భిక్కనూర్ పట్టణంలోని స్థానిక సిద్ధరమేశ్వర కమాన్ వద్ద అరేపల్లికి చెందిన ప్రవీణ్ రాథోడ్ ఫాస్ట్‌ఫుడ్ అండ్ బిర్యానీ పాయింట్‌ను మాజీ మంత్రి షబ్బీర్ అలీ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ స్వయం ఉపాధితో ప్రతి ఒక్కరూ ఆర్థికంగా అభివృద్ధి చెంది కుటుంబాలను పోషించుకోవాలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, భిక్కనూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీమ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు దయాకర్‌రెడ్డి, లింబాద్రి, సిద్దగౌడ్, గజ్జె సురేష్, దుంపల మోహన్‌రెడ్డి, సాజిద్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈవీఎంలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి

- ఎమ్మార్వో దశరథ్

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

ఈవీఎంలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని ఎమ్మార్వో దశరథ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దశరథ్ మాట్లాడుతూ ఈవీఎం, వీవీప్యాట్‌ల పనితీరు గురించి వివరించారు. ఓటరు ఓటు వేసిన తరువాత వీవీప్యాట్ డిస్‌ప్లేపై ఏడు సెకండ్ల పాటు కనిపిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఈవీఎంల ద్వారానే ఓటు హక్కు వినియోగించుకోనున్నందున ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గిర్దవార్ అంజయ్య, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేగాం ఉన్నత పాఠశాలలో రూరల్ జోనల్ స్థాయి కబడ్డీ ఎంపికలు



నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని దేగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రూరల్ జోనల్ స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలకు విద్యార్థిని విద్యార్థులను ఎంపికలు చేశారు. అండర్-14, అండర్-17 బాలికలకు రూరల్ జోనల్ స్థాయి ఎంపికలు చేశారు. జక్రాన్‌పల్లి, ఆలూర్, ఆర్మూర్ రూరల్‌కు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సరోజ గంగారెడ్డి, ఎంపీటీసీ అనూష శ్రీనివాస్ గౌడ్ పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

82వ మహజన సభ



నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంగం 82వ మహాజన సభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి సంతోష్ సంఘు్య లెక్కలను సభ్యులకు చదివి వినిపించారు. వచ్చే సీజన్‌లో ధాన్యం కొనుగోలుపై చర్చ నిర్వహించారు. అనంతరం కొండ లక్ష్మన్ బాపూజీ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటి చైర్పర్సన్ గోపి లక్ష్మి, వైయస్ చైర్మన్ రమేష్, డైరెక్టర్లు, సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

తేజశ్రీపై హత్యాయత్నం చేసిన వారిపై కఠినంగా శిక్షించాలి

- మహిళా సంఘాల ర్యాలీ

నవతెలంగాణ- జక్రాన్‌పల్లి

మండల కేంద్రానికి చెందిన తేజశ్రీపై హత్యాయత్నంకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ మహిళ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని అరుంధతి ఫంక్షన్ హాల్ నుంచి ప్రధాన వీధుల గుండా మహిళా సంఘాలు అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామంలోని అన్ని మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ముక్తార్ పాషా వర్ధంతి పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో బుధవారం సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముక్తార్ పాషా వర్ధంతి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బి.భాస్కర్ మాట్లాడుతూ ఈనెల 30న వరంగల్ జిల్లా కేంద్రంలో జరిగే కామ్రేడ్ మూక్తార్ పాష 3వ వర్ధంతి సభను జయప్రదం చేయాలన్నారు. కార్మికరంగంలో వస్తున్న పరిణామాలపై అంచనా వేయడంలోనూ కార్మికులు ఎదుర్కొనే సమస్యలపై చేపట్టిన ఉద్యమాన్ని నిర్మాణాత్మకంగా నడపడంలోనూ మంచి నైపుణ్యం ఉన్న ఆర్గనైజర్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు బి.గంగారెడ్డి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అల్తాఫ్, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ కమ్మర్ పల్లి సబ్ డివిజన్ కార్యదర్శి పెద్ద ఆశన్న, నాయకులు పాల్గొన్నారు.

ఐటిఐ కళాశాలలో మొక్కలునాటే కార్యక్రమం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో బుధవారం మొక్కలు నాటి కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సక్కారం అశోక్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవలో భాగంగా ఐటీఐ కళాశాల వద్ద మొక్కలు నాటారు.అనంతరం ఐటీఐ కళాశాల ఆవరణలో విద్యార్థులతో శ్రమదానం చేశారు. శ్రమదానంలో భాగంగా కళాశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, చెత్తాచెదారం ఊడ్చి శుభ్రం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ కళాశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులు చెత్త చెదారంతో కళాశాలను పరిశుభ్రతను పాడు చేయొద్దు అన్నారు. కళాశాల ఆవరణలో నాటిన మొక్కలను సంరక్షించేందుకు విద్యార్థులు తల ఒక మొక్కను దత్తత తీసుకోవాలని సూచించారు. దీనివల్ల బాధ్యతలు తెలిసి వస్తాయన్నారు. పిచ్చి గడ్డిని తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉప సర్పంచ్ కస్తూరి విక్రమ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలో విజయ్ విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న అమృతలత

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఫుట్బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఫుట్బాల్ ఛాంపియన్షిప్ పోటీలు కర్ణాటకలోని బెల్గావిలో ఈ నెల 14 నుండి 24 వరకు జరిగిన ఈపోటీల్లో విజయ్ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న సి. హెచ్. జాహ్నవి యాదవ్ పాల్గొని ప్రతిభ కనబరిచారని విజయ్ హైస్కూల్ వ్యవస్థాపకులు డాక్టర్ అమృతలత తెలిపారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో విజయ్ విద్యార్థి

తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో తైక్వాండో ఛాంపియన్షిప్-2023 పోటీలు ఇండోర్ స్టేడియం, వరంగల్‌లో ఈనెల 24న ఆదివారం జరిగాయని తెలిపారు. ఈ పోటీలలో విజయ్ హైస్కూల్లో మూడవ తరగతి చదువుతోన్న దానీష్ రబి వివిధ విభాగాలలో రెండు బంగారు పతకాలు సాధించారు అని విజయ్ హైస్కూల్ వ్యవస్థాపకులు డాక్టర్ అమృతలత అన్నారు. తైక్వాండోలో పతకాలు సాధించిన దానిష్ రబిని ప్రత్యేకంగా అభినందించారు.

ఫూలే పోరాట స్ఫూర్తితో కులరహిత సమాజానికి పోరాడుదాం

- సిపిఐఎంఎల్ న్యూడేమోక్రసి జిల్లా నాయకులు వేల్పూర్ భూమయ్య

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మహాత్మా జ్యోతి బాపూలే స్ఫూర్తితో కులరహిత సమాజానికి పోరాడాలని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా నాయకులు వేల్పూర్ భూమయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఘనపూర్‌లో న్యూడెమోక్రసి ఆధ్వర్యంలో సత్యశోధక్ సమాజ్ 150వ వార్షికోత్సవం సందర్భంగా కుల నిర్మూలన సదస్సు న్యూడెమోక్రసి రూరల్ కార్యదర్శి జెపి గంగాధర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదస్సులో వేల్పూర్ భూమయ్య పాల్గొని మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడాలేని కుల వ్యవస్థ ఇక్కడ ఉందని అన్నారు. బ్రాహ్మణులు తప్ప ఇతరులు వేదాలు చదివిన, విన్న నాలుకలు కోసి, చెవులలో సీసం పోసిన మనువాద ధర్మానికి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప వ్యక్తి పూలేనే అన్నారు. 150 సంవత్సరాల క్రితమే దేశంలో ప్రజల మధ్య జరుగుతున్న అసమానతలు, అణచివేతలు, దాడులు, దౌర్జన్యాలు నిరసిస్తూ దళితులను, అణగారిన ప్రజలను అత్యంత హీనంగా చూసే కుల వ్యవస్థకు వ్యతిరేకంగ పోరాడిన గొప్ప వ్యక్తి జ్యోతి బాపూలే అని పేర్కొన్నారు. తన సహచరిని సావిత్రి బాయి పూలె ద్వారా అణగారిన ప్రజలకు, దళితులకు, ముఖ్యంగా మహిళలకు చదువు చెప్పిన మొట్టమొదటి చదువులతల్లి అన్నారు. ఈనాటికి ఆధిపత్య అగ్రకులాల వారు నిరంతరం దళితులపై, మహిళలపై కులం పేరుతో మతం పేరుతో దాడులు, దౌర్జన్యాలు, మానభంగాలు, అత్యాచారాలు, హత్యలు చేస్తున్నారని అయన ఆవేదన వ్యక్తం చేశారు. మహాత్మా జ్యోతి బాపూలే పోరాటాల స్ఫూర్తితో కుల రహిత సమాజానికై పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమావేశంలో ఎఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి సాయి రెడ్డి,అగ్గు ఎరన్న, కృష్ణ గౌడ్, భారతి, సాయినాథ్, పద్మ, బన్నీ, చిన్నాన్న తదితరులు పాల్గొన్నారు.

అసమానతలు లేని సమాజం కోసం పోరాడాలి : పీడీఎస్‌యూ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

అసమానతలు లేని సమాజం కోసం విద్యార్థులు నిరంతరం పోరాడాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సత్య శోదక్ సమాజ్ 150వ వార్షికోత్సవం సందర్భంగా కుల నిర్మూలన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమాజంలో అణగారిన కులాలకు విద్య అందించడం కోసం కుల వ్యవస్థకు వ్యతిరేకంగా, బ్రాహ్మణీయ అశాస్త్రీయ సనాతన పద్ధతులకు వ్యతిరేకంగా నిరంతరం పూలే దంపతులు పోరాటం చేశారని అన్నారు. నేడు సమాజంలో కుల వివక్షత పెరిగిపోయిందని, దళితులపై మైనార్టీలపై దాడులు చేస్తున్నారని , విద్యను కాషాయీకరిస్తున్నారని, సమాజంలో అసమానతలు పోయి కుల రహిత సమాజం కోసం నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పి.డి.ఎస్.యూ నాయకులు పవన్, విజయ్,వంశీ, పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు బండమీద నర్సయ్య పాల్గొన్నారు.

అంగన్వాడీలన్యాయమైన కోరికలు అమలుచేయకపోతే

బీఆర్ఎస్ ప్రభుత్వ పతనం తప్పదు

- సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ హెచ్చరిక
- 17వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె



కంఠేశ్వర్: నిజామాబాద్‌లో నినాదాలు చేస్తున్న నూర్జహాన్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

నవతెలంగాణ-విలేకరులు

కంఠేశ్వర్ అంగన్వాడీల న్యాయమైన కోరికలు అమలుచేయకపోతే బీఆర్ఎస్ ప్రభుత్వ పతనం తప్పదు అని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ హెచ్చరించారు. బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ధర్నా చౌక్ వద్ద 17వ రోజు సమ్మె శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. గత నెలలో రాష్ట్ర ప్రభుత్వానికి అంగన్వాడీ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ప్రయత్నిస్తే స్వయంగా మంత్రే యూనియన్‌లతో చర్చలు జరిపారని అన్నారు. చర్చల్లో అంగీకరించిన రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను ఎటువంటి షరతులు లేకుండా మినీ టీచర్స్‌ని మెయిన్ టీచర్స్‌గా గుర్తిస్తామన్న హామీని విస్మరించారన్నారు. అనేక షరతులతో మినీలను మెయిన్ టీచర్స్‌గా గుర్తుస్తామని సర్క్యులర్ విడుదల చేశారని తెలిపారు. స్వయంగా మంత్రే చర్చల్లో ఇచ్చిన హామీలకు దిక్కే లేకుండా పోయిందన్నారు. వేతనాలు పెంపుదల, పర్మినెంట్, ప్రమాద భీమా, జీతంలో సగం పెన్షన్‌గా ఇవ్వడం వంటి సమస్యలపై దాత వేత ధోరణితో ప్రభుత్వం వ్యవహరిస్తుందని తెలిపారు.

సమ్మెని విచ్ఛిన్నం చేసేందుకు పడరాని పాట్లు పడుతున్నారని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజనం కార్మికులను పంపి అంగన్వాడీ సెంటర్లను నడపడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఈ ప్రయత్నాలను విరమించుకోకపోతే వారందరినీ అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు.ధనిక రాష్ట్రంగా గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కనీస వేతనం రూ 26 వేల రూపాయలు ఇవ్వడానికి ఎందుకు చేతులు రావడం లేదని ప్రశ్నించారు. ఏ సర్వే చేయాలన్నా అంగన్వాడీలే తప్ప మరొకరు కాదని అన్నారు. సమ్మె పట్ల అధికారులు దూకుడుగా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సి ఐ టి యు జిల్లా ఉపాధ్యక్షులు మల్యాల గోవర్ధన్ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి స్వర్ణ , రాజ సులోచన వాణి, జరీనా, సరిత, సునీత, శివ రాజమ్మ, సుజాత, రాధిక, స్వప్న, విజయ, రేణుక, సందీప, గోదావరి, స్రవంతి, రాణి, పాల్గొన్నారు.

నవీపేట్:ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విజయవంతం చేస్తున్న అంగన్వాడీలకు అన్యాయం చేయొద్దని తాహసిల్దార్ కార్యాలయం వద్ద 17 రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్వాడీలకు కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యోగులుగా గుర్తించి పీఎఫ్, ఈఎస్ఐ రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినాయక నిమజ్జనంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయానికి విచ్చేసిన జెసి యాదిరెడ్డికి న్యాయం చేయాలని వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు దేవేందర్ సింగ్, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:తమ డిమాండ్లు పరిష్కరించాలని, గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అంగన్వాడీ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె కొనసాగుతుంది. మండల కేంద్రంలోని హాస కొత్తూర్ చౌరస్తా వద్ద నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శిబిరం వద్ద వంట వార్పుతో అంగన్వాడీ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ వెంటనే ప్రభుత్వం స్పందించి అంగన్వాడి ఉద్యోగులను క్రమబద్ధీకరించడంతోపాటు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శిబిరం వద్దే వంట చేసుకుని, సామూహిక భోజనాలు చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లి : వంటావార్పు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



ఆర్మూర్ : మాట్లాడుతున్న రమేష్‌బాబు

ఆర్మూర్:అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు అన్నారు పట్టణంలో తహసిల్దార్ కార్యాలయం ముందు బుధవారం జరిగిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు. మండలంలోని అంగన్వాడీలు ఆయాలు 17 రోజులుగా కనీస వేతనం కోసం ధర్నా చేస్తే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల న్యాయమైన డిమాండ్స్ పరిష్కారం చేయాలని అన్నారు. కనీసవేతనం 26 వేలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. అంగన్వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కనీస వేతనం 26 కల్పించాలని అన్నారు. అంగన్వాడీలను పర్మినెంట్ చేయాలని, హెల్త్ బీమా కార్డులు ప్రభుత్వం ఇవ్వాలని, రిటైర్మెంట్ తర్వాత పదిలక్షల రూపాయలు ప్రభుత్వం అందించాలని అన్నారు. సిఐటియు కార్మిక నాయకులతో ప్రభుత్వం చర్చ జరపాలని లేనియెడల అంగన్వాడీ టీచర్లు, ఆయాలు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు డివిజన్ కన్వీనర్ కుతాడి ఎల్లయ్య, సిపిఎం పార్టీ కమిటీ సభ్యులు భూమన్న, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి సిద్ధాల నాగరాజు, సెక్టార్ లీడర్స్ చంద్రకళ, లక్ష్మి అరుణ, జగదంబ, సునంద, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి:అంగన్వాడి టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా పర్మినెంట్ చేయాలని పిడిఎస్‌యూ, ప్రజాపంథా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయం ముందు అంగన్వాడి ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె శిబిరాన్ని పిడిఎస్‌యూ, ప్రజాపంతా నాయకులు సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్యు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అంగన్వాడీ టీచర్లకు సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ప్రజాపంథా ఆర్మూర్ డివిజన్ నాయకులు దేవారం పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లిలో...

జోనల్‌స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన బషీరాబాద్ విద్యార్థులు



కబడ్డీపోటీలకు ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన కమ్మర్‌పల్లి జోన్‌స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలలో బషీరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. బషీరాబాద్ విద్యార్థులు కబడ్డీ అండర్-14, అండర్-17 బాల బాలికల విభాగంలో ఎంపికయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బషీరాబాద్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జోనల్ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ప్రధానోపాధ్యాయులు కనక గంగాధర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ 3న బాల్కొండ మండల కేంద్రంలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. 26న వేల్పూర్ మండలం పడగల్ లో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలలో అండర్-14 బాలుర విభాగంలో కమ్మర్‌పల్లి జోన్ ప్రథమ స్థానం దక్కించుకుందని తెలిపారు. ఇందులో బషీరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వినయ్, ఫైజల్, శ్రీవర్షిత్ సభ్యులుగా ఉండి బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. అండర్-14 బాలికల విభాగంలో అల్లకొండ మహాన్య, తీరాడి శివప్రియ నిజామాబాద్, కామారెడ్డి రెండు జిల్లాల మధ్య జరిగే పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఎంపికైన క్రీడాకారులను సర్పంచ్ సక్కరం అశోక్, ఎంపీటీసీ సభ్యురాలు తోట జ్యోతి, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఆకుల బాజన్న, ఎస్ఎంసి చైర్మన్ సీరెడ్డి సాయన్న, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ

ఆశయస్ఫూర్తికి అనుగుణంగా కేసీఆర్ పాలన

- రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- కమ్మర్‌పల్లిలో కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహావిష్కరణ
- ఘనంగా బాపూజీ జయంతి



కొండాలక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి వేముల



నివాళ్లు అర్పిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ స్ఫూర్తికి అనుగుణంగా కేసిఆర్ పాలన సాగుతుందని రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. బుధవారం కొండా లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతి పురస్కరించుకుని మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాపూజీ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. అనంతరం పద్మశాలి విజయ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్‌తో కలిసి కొండా లక్ష్మణ్ బాపూజీతో చాలా సార్లు మాట్లాడాడని అన్నారు. ఆయన ఏ విషయమైనా సూటిగా స్పష్టంగా చెప్పేవారని అప్పటి జ్ఞాపకాలు నేమరేసుకున్నారు. హైదరాబాద్ లో టిఆర్ఎస్ కార్యాలయం కోసం కిరాయికి కూడా ఎవరు ఇల్లు ఇవ్వలేనీ రోజులని, ఎవరూ కిరాయికి ఇవ్వొద్దని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు దుర్మార్గంగా వ్యవహరించారన్నారు. కానీ కొండా లక్ష్మణ్ బాపూజీ తనకు కేటాయించిన ఇంటిని తెలంగాణ రాష్ట్ర సమితి కోసం ఇచ్చారని తెలిపారు. జల దృశ్యంలోని ఇంటిలో ఉన్న కార్యాలయం తాళాలు పగులగొట్టి ఫర్నిచర్ బయట పడేశారన్నారు. దాన్ని ఛాలెంజ్‌గా తీసుకున్న కేసిఆర్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత అదే ప్రాంతంలో ప్రపంచమే అబ్బుర పడేవిధంగా తెలంగాణ అమరుల స్మారకం నిర్మించారని అన్నారు. బాల్కొండ అన్ని మండల కేంద్రంలో లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని పెట్లాలనేది తన కోరికని మంత్రి వెల్లడించారు. తన కన్న తల్లి ఆరోగ్యం బాగా లేక హైదరాబాద్ హాస్పటల్‌లో ఉన్నా ఈ మీటింగ్ కోసం వచ్చానని చెప్పారు. రానున్న రోజుల్లో పద్మశాలి అభివృద్ధి కోసం కృషి చేస్తామని ప్రకటించారు. అంతకుముందు పద్మశాలి నేతలు మంత్రి వేములకు అపూర్వ స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. జై మార్కండేయ.. జోహార్ బాపూజీ నినాదాలతో పద్మశాలిలు హోరెత్తించారు. సభ ప్రారంభానికి ముందు కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఆర్డీవో వినోద్ కుమార్, ఆర్మూర్ ఏసిపి జగదీష్ చందర్, డిసిసిబి వైస్ చైర్మన్ రమేష్ రెడ్డి, జిల్లా పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి పుల్గం హన్మాండ్లు, ఉపాధ్యక్షులు బిజ్జు దత్తాద్రి, బాల్కొండ నియోజకవర్గ అధ్యక్షులు రాజా పూర్ణానందం, మండల అధ్యక్షులు చింత తిరుపతి, ఎంపీపీ అధ్యక్షురాలు గౌతమి, జడ్పిటిసి సభ్యురాలు రాధా రాజా గౌడ్, సర్పంచ్ గడ్డం స్వామి, ఎంపీటీసీ సభ్యుడు మైలారం సుధాకర్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, కమ్మర్‌పల్లి గ్రామ శాఖ అధ్యక్షులు చింత గణేష్, మండలంలోని పద్మశాలి సంఘాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.

ప్రతినెల 27న నిధి ఆప్కే నిఖిత్ శిబిరం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రతినెల 27న జిల్లాలో నిర్వహించనున్న నిధి ఆప్కే నిఖిత్ 2.0 శిబిరంను పింఛనుదారులు, చందదారులు సద్వినియోగం చేసుకొవాలని నిజామాబాద్ పీఎఫ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి శ్రవణ్ కుమార్ కోరారు. బుధవారం డిచ్ పల్లి మండల కేంద్రంలోని ఘన్‌పూర్ గ్రామంలోని వందేమాతరం పాఠశాలలో నిర్వహించిన నిధి ఆప్కే నిఖిత్ కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.

ఈ ప్రత్యేక శిబిరానికి హజరైన వారి సమస్యలను అక్కడిక్కడే పరిష్కారస్తామని చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో పింఛనుదారులు, చందాదారులు తరలివచ్చారు.

రేపటి సమావేశానికి చేనేత సభ్యులు హాజరుకావాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

శుక్రవారం నిర్వహించి చేనేత సహకార సంఘం సర్వ సభ్య సమావేశానికి చేనేత సహకార సంఘంలో సర్వసభ్యులు హాజరుకావాలని హండ్లుమ్ వేవర్స్ కోపరెటివ్స్ సొసైటీ అధ్యక్షులు గుద్దెటి రామకృష్ణ తెలిపారు. బుధవారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు.

నిమజ్జనంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- అదనపు కలెక్టర్ యాదిరెడ్డి

నవతెలంగాణ-నవీపేట్



మాట్లాడుతున్న యాదిరెడ్డి

వినాయక నిమజ్జనంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ యాదిరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాల యంలో కార్యదర్శులు, ఐకెపి, ఇరిగేషన్, వైద్య శాఖ అధికారులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంతో పాటు జిల్లా నలుమూలల నుండి వినాయక ప్రతిమలు నిమజ్జనం కోసం గోదావరికి వస్తుండడంతో మండల అధికార యంత్రాంగం సమన్వయంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకొని విజయవంతం చేయాలని అన్నారు. చిన్న నిర్లక్ష్యం కారణంగా ప్రాణాపాయ సమస్యలు ఏర్పడే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా విధులు నిర్వహించాలని లేనియెడల క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం యంచ గోదావరి ఘాట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో ధన్వాల్, ఎంపీడీవో సాజిద్ అలీ, ఎం పి ఓ రామకృష్ణ, ఎస్సై యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-ఏర్గట్ల/జక్రాన్‌పల్లి



ఏర్గట్ల : చెక్కులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో మహమ్మద్ యూసుఫ్, ఎంపీపీ ఉపేందర్‌రెడ్డి కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. తహసీల్దార్ మహమ్మద్ యూసుఫ్ మాట్లాడుతూ... తడపాకల్ గ్రామానికి 2, దోంచందకు-1, తాళ్ళ రాంపూర్‌కు-1 చెక్కులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ భానుప్రసాద్, కోఆప్షన్ సభ్యుడు అష్రాఫ్, పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి:జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన కట్కే పీరామత్ కి షాదీ ముబారక్ చెక్కు కాట్పల్లి యమునకు కల్యాణ లక్ష్మి చెక్కులను ప్రజాప్రతినిధులు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కం చంద్రకళ బాలకిషన్, ఎంపిటిసి-1 రూపాల గంగారెడ్డి, ఎంపీటీసీ-2 మారియ సతీష్, మండల కోఆప్షన్ బుల్లెట్ అక్బర్ ఖాన్, పాల్గొన్నారు.

నిరుపేదకు ఆపద్బాంధవుడు సీఎం కేసీఆర్

- ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలను కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి కింద చికిత్సకు ఆర్థిక సాయం బాధితులకు అందిస్తూ సీఎం కేసీఆర్ ఆపద్బాంధవుడిగా నిలుస్తున్నాడని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే నివాస గృహంలో సీఎంఆర్ఎఫ్, లెటర్ అఫ్ క్రెడిట్ (ఎల్ఓసి) చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఇందల్ వాయి మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన వై. కల్పన కు లక్ష 50 వేల చెక్కును నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు ఉప సర్పంచ్లు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పదోన్నతిపై వచ్చిన హెచ్ఎంకు ఆత్మీయ సన్మానం

నవతెలంగాణ-బోధన్

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాకాసిపేట(జేసీ)లో గజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా నిజామాబాద్ నుంచి పదోన్నతిపై వచ్చిన బాలచంద్రంను బుధవారం పాఠశాలలో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. అలాగే తెలంగాణ ఆర్ట్, క్రాఫ్ట్ ఇన్ స్ట్రక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు శాలువా, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం బాలచంద్రం మాట్లాడుతూ ప్రతి ఒక ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నగేష్‌బాబు, సుధాకర్ రెడ్డి, సునీత్‌కుమార్, రాచప్పా, శ్రీనివాస్, వెంకట్, గుణేశ్వర్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

3
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
గురువారం | సెప్టెంబర్ 28, 2023 | www.navatelangana.com

భారీగా ధర పలికిన వినాయకుడి లడ్డు

నవతెలంగాణ-పిట్లం



మండల కేంద్రంలోని ఆర్య వైశ్య భవనంలో తొమ్మిది రోజులపాటు కొలువుదీరి విశేష పూజలు అందుకున్న వినాయకుడి లడ్డుకు భారీ ధర పలికింది. మంగళవారం రాత్రి వినాయకుడి శోభాయాత్రను ఆర్య వైశ్యులు అత్యంత అట్టహాసంగా నిర్వహించారు. శోభయాత్ర నిమజ్జనంలో భాగంగా ఏర్పాటు చేసిన సంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి. కాగా లడ్డు వేలం పాట కార్యక్రమం నిర్వహించగా తీవ్ర పోటీ నెలకొన్నప్పటికీ తిమ్మానగర్ గ్రామానికి చెందిన కొండ రాజులు గుప్తా దంపతులు 63 వేల రూపాయల పాట పాడి దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం అందించాలి

నవతెలంగాణ-విలేకరుల బృందం

పిట్లం : ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం అందించాలని ఆశాలు డిమాండ్ చేశారు. బుధవారం ఆశాల నిరవధిక సమ్మె మూడవ రోజుకు చేరింది. ప్రభుత్వాసుపత్రి ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీలు, బాలింతలకు ఆరోగ్య సేవలు అందించడమే కాకుండా ఏఎన్ఎంలకు చేదోడు వాదోడుగా ఆరోగ్య సేవలలో తమకంటూ ఓ ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. కరోనా సమయములో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి రాత్రి పగలు తేడా లేకుండా నిర్విరామంగా కృషి చేశామన్నారు. అందుకుగాను తమకు రూ.18వేల వేతనం అందిస్తూ, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు కామేశ్వరి, శశికళ, సునీత, భాగ్యలక్ష్మి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఎడపల్లి మండల ఆశావర్కర్లు బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కరోనా సమయంలో తమ కుటుంబ సభ్యులను వదులుకొని ప్రజలకు సేవలు అందించాలని లక్ష్యంతో తాము కష్టపడ్డప్పటికీ తమకు కేంద్ర ప్రభుత్వం ద్వారా రావాల్సిన కరోనా వేతనాలు ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. సుమారు నెలకు రూ.1000 చొప్పున 16నెలల గౌరవ వేతనం రావాల్సి ఉందని ఆమె అన్నారు. బుధవారానికి మూడో రోజు సమ్మె చేరుకుంది. తమ సమస్యలను డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, ఆశ వర్కర్ల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఇనుగు రాజమణి డిమాండ్ చేశారు. ఆశవర్కర్ల సంఘం అధ్యక్షురాలు పంచశీల, తాటి విజయ, కుంట అనిత, అనసూయ, విజయలక్ష్మి, అబ్బవ్వ, స్వరూప, ఆయా గ్రామాల ఆశావర్కర్లు పాల్గొన్నారు.



ఎడపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆశాకార్యకర్తలు

తాడ్వాయి : మండలంలోని ఎర్రపహాడ్ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆశా వర్కర్లు కనీసవేతనం కోసం మూడవ రోజు సమ్మె నిర్వహించారు. ఆశలు మాట్లాడుతూ సమ్మె ఆపేది లేదని హెచ్చరించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశాలకు ఇస్తున్న పారితోషికాలను 18 వేల ఫిక్స్ జీతం ఇవ్వాలని అలాగే ఆశాలకు పిఏఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం ఉద్యోగ భద్రత కల్పించాలని ఆరోగ్య భద్రతా కార్డులు ఇవ్వాలని ప్రమాద బీమా సౌకర్యం వర్తింప జేయాలని ఏఎన్ఎం, జి ఏ ఎన్ ఎం పోస్టులు ఆశాలకు ప్రమోషన్స్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. పారితోషికం లేని పనులు ఆశాలతో చేయించవద్దని, టీబీ స్ప్యూటము డబ్బాలను ఆశాలతో తేవడం రద్దు చేయాలని, ఆశాలకు పనిభారం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో తాడ్వాయి మండలం ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బోధన్ టౌన్ : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బోధన్ పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఆశా వర్కర్లు బుధవారం సమ్మె చేపట్టారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించి, నెలకు కనీస వేతనం 18 వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి, సూదమ్మ, విజయ, దివ్య, సుజాత, గంగామణి, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశావర్కర్లు చేస్తున్న సమ్మె మూడోరోజుకు చేరుకుంది. ప్రభుత్వం వివిధ పథకాల పేరుతో పనులు చేయించుకుంటూ, తమకు కనీస వేతనం ఇవ్వడం లేదని వారు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆశలకు కనీస వేతనము 18 వేల రూపాయలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో తమ కుటుంబాలు గడవడం లేదని, ప్రభుత్వం వెంటనే స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం సభ్యులు కవిత, సుజాత, రేవతి, రేఖ, స్రవంతి, పద్మ, లావణ్య, లక్ష్మీ, శ్యామల, అజ్మీర్, ,నాజియా, వసంత, శారద, లక్ష్మి వసంత తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల నిరవధిక సమ్మె ఉధృతం

నవతెలంగాణ-విలేకరుల బృందం

మద్నూర్ : ఐసిడిఎస్ పరిధిలో పనిచేసే అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తమకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె చేపడుతున్న విషయం తెలిసిందే. కాగా బుధవారం సమ్మె 17వ రోజుకు చేరుకుంది. రోజురోజుకూ సమ్మెను ఉధృతం చేస్తున్నారు. సిఐటియు కార్మిక సంఘం ఆధ్వర్యంలో మద్నూర్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని మద్నూర్, డోంగ్లి, జుక్కల్, బిచ్కుంద, పెద్దకొడప్‌గల్ మండలాలకు చెందిన అంగన్వాడీ టీచర్లు, ఆయాలు మద్నూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట భారీ ఎత్తున ఆందోళన చేపట్టారు. అక్కడి నుండి సిఐటియు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో భారీ ఎత్తున ర్యాలీ చేపట్టారు. అనంతరం ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెలో భాగంగా వంటావార్పు ఆందోళన నిర్వహించారు. అంగన్వాడి టీచర్లు ఆయాలు న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన వంటావార్పు కార్యక్రమానికి సిఐటియు కార్మిక సంఘం నాయకులతో పాటు బీఎస్పీ పార్టీ నాయకులు సాయిలు, గంగారాం వైఎస్సార్ పార్టీ నాయకులు బోరుగి సంజు పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధిలోని ఐదు మండలాలకు చెందిన అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు

మద్నూర్ : రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న అంగన్వాడి డిమాండ్ల పరిష్కారం కోసం అంగన్వాడి రాష్ట్ర జేఏసీ ప్రత్యేకంగా సమావేశమై రోజువారి ఆందోళనపై నిర్ణయాలు ప్రకటించిందని కామారెడ్డి జిల్లా సిఐటియు కార్యవర్గ సభ్యులు సురేష్ గొండ బుధవారం తెలిపారు. సెప్టెంబర్ 27న ప్రాజెక్టు కేంద్రాలలో కుటుంబ సభ్యులతో వంటావార్పు, ధూమ్‌ధాం ప్రోగ్రాం చేయాలని, సెప్టెంబర్ 29న బిక్షాటన, సెప్టెంబర్ 30న పొర్లు దండాలు, అక్టోబర్ 1న రాస్తారోకోలు, 2న గాంధీ విగ్రహాలకు వినతి, 3,4 తేదీలలో రెండు రోజులు పాదయాత్రలు, ప్రాజెక్ట్ కేంద్రాలలో ప్రారంభించి జిల్లా కేంద్రం కలెక్టరేట్ చేరుకోవాలని, అక్టోబర్ 10న ఛలో హైదరాబాద్ ఉంటుందని, ఆ తేదీల ప్రకారం రోజువారీ ఉద్యమాలు చేపట్టనున్నట్టు వివరించారు.

పిట్లం : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు అంగన్వాడీ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి 17 రోజులకు చేరుకోగా ధూమ్ దాం ఆటపాటలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ, 26 వేల రూపాయల కనీస వేతనం అమలు పరచాలని, పిఎఫ్ , ఈఎస్ఐ , రిటైర్మెంట్ బెన్ఫిట్స్ ప్రకటించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి రాధా , అన్నారం అనురాధ , జంగం సుమలత , కారేగావ్ అను రాధ , సుజాత , జగదీశ్వరి , గౌరవ , పార్వతి , జయంతి , ప్రవీణ , చిల్లేర్గి శోభ , విజయలక్ష్మి , శోభ ,ఆయా లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల, ఆశావర్కర్ల వంట వార్పు

రామారెడ్డి : మండలంలో అంగన్వాడీ టీచర్, ఆయాలు, ఆశావర్కర్లు వారి సమస్యల పరిష్కారం కోసం సమ్మెలో భాగంగా వంటావార్పును నిర్వహించారు. వంట వార్పుకు కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలిపి, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు నారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. అంగన్వాడీల, ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కాంట్రాక్ట్ ఉద్యోగాలు ఉండవని చెప్పి, రాష్ట్రం ఏర్పడి 10 సంవత్సరాలైనా కాంట్రాక్టు ఉద్యోగులు కొనసాగుతున్నారని, ప్రభుత్వం చిత్తశుద్ధితో అంగన్వాడీల, ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆశావర్కర్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ధర్నా నిర్వహించారు. అంగన్వాడి టీచర్లు, ఆశావర్కర్లు, అంగన్వాడీ ఆయాలు, కాంగ్రెస్ నాయకులు నామాల రవి, బీపేట నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యం, విద్యా, వ్యవసాయానికి మొదటి ప్రాధాన్యత

- ఎంపీపీ అశోక్ పటేల్

నవతెలంగాణ-బిచ్కుంద



మాట్లాడుతున్న ఎంపీపీ

వైద్యం, విద్యా, వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యత కల్పిస్తు గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మొదటిస్థానంలో నిలిచిందని జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధికి జుక్కల్ శాసనసభ్యులు, అసెంబ్లీ ప్యానల్ స్పీకర్ హనుమంత్‌షిండే కృషి ఎంతో ఉందని ఎంపీపీ అశోక్ పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ అశోక్ పటేల్ మాట్లాడుతూ బిచ్కుంద మండల కేంద్రంలోని 30 పడకల సిహెచ్‌సిని ఆసుపత్రికి వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడం పట్ల ముఖ్యమంత్రి కెసిఆర్‌కు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావుకు జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత్ షిండేకు కృతజ్ఞతలు తెలిపారు. వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినందుకు ఈ ప్రాంత ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సదుపాయాలు ప్రజలకు అందుతాయని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ మంజూరు చేసి వైద్య రంగానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఇక్కడ డయాలసిస్ సెంటర్ ప్రారంభించడం వలన ఎంతో మంది కిడ్నీ రోగులకు వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. బిచ్కుందలో మంజూరైన రోడ్డు విస్తరణ పనులు సెంట్రల్ లైటింగ్ పనులు మొదలయ్యాయని పనులు త్వరలోనే పూర్తి చేయనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో రైతు సహకార సంఘం అధ్యక్షులు శ్రీహరి బాలాజీ, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగనాథ్ పటేల్, పుల్కల్ సొసైటీ చైర్మన్ రామ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటరావు దేశాయ్, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు బసవరాజ్ పటేల్, నాయకులు బొమ్మల లక్ష్మణ్, ఎంపిటిసి ఫోరం అధ్యక్షులు సిద్దరం పటేల్ ఉన్నారు.

రైతుల రుణమాఫీలో భయాందోళన చెందొద్దు

నవతెలంగాణ-రెంజల్

రైతుల రుణమాఫీ విషయంలో ఎలాంటి భయాందోళనలు చెందవద్దని, అధికారులు అందించిన లిస్టులో పేరు ఉన్న ప్రతి ఒక్క రైతుకు కొంత జాప్యం జరుగుతున్నప్పటికీ అందరికీ రుణమాఫీ వర్తిస్తుందని దూపల్లి సొసైటీ అధ్యక్షులు ఎస్.భూమారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని దూపల్లి సొసైటీ చైర్మన్ అధ్యక్షతన మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిగతా రైతులకు కూడా విడుతలవారీగా రుణమాఫీ చేయనున్నట్టు వివరించారు. రైతులు ఈ ఏడాది 75 లక్షల దీర్ఘకాలిక రుణాలను చెల్లించారని, మరో 35లక్షలు ప్రభుత్వానికి చెల్లిస్తే సొసైటీ లాభాల్లో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. 319 మంది రైతులు క్రాప్ రుణాలను తీసుకోగా, 118 మంది రైతులకు మాఫీ వచ్చిందన్నారు. వీరికి ఇరవై ఒక్క లక్ష 62 వేల రూపాయలు మాఫీ అయ్యాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని ప్రకటనలు ఇచ్చినప్పటికీ, సొసైటీ సిబ్బంది నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసమని రైతులు పేర్కొన్నారు. ఆరబోసిన ధాన్యం సైతం వర్షాలకు తడిస్తే రైతులు ఏం చేయాలని వారు ప్రశ్నించారు. రైస్ మిల్లర్లు తడిసిన ధాన్యాన్ని వెనుకకు పంపించడంతో తమకు రవాణా చార్జీలు రెండింతలు అయ్యాయని భూమారెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం తమ సొసైటీ 26లక్షల 79 వేల రూపాయల ఆదాయం వచ్చిందని ఆయన స్పష్టం చేశారు. మరో 85 లక్షల రూపాయలు ప్రభుత్వానికి చెల్లిస్తే సొసైటీ రుణాల నుండి బయటపడినట్టేనని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శనిగరం సాయిరెడ్డి, డైరెక్టర్లు పల్లె సాయిలు, ధనుర్ గంగాధర్, కునపల్లి రాజారెడ్డి, జి.ప్రతాపరెడ్డి, గైని గోపాల్, గంగారాం, నీరడి రవికుమార్, మైని రాజ్‌కుమార్, కాశం సాయిలు, ముళ్ళపూడి వరలక్ష్మి, లింగన్న యాదవ్, సుదర్శన్ యాదవ్, గంగాధర్, నారాయణరెడ్డి సంజీవ్, కార్యదర్శి జీవన్‌రెడ్డి, సిబ్బంది, ఎల్.సాయన్న ప్రతాపరెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

లాభాల బాటలో రెంజల్ సొసైటీ

నవతెలంగాణ-రెంజల్

పాలకవర్గ సభ్యులు, సిబ్బంది సహాయ సహకారాలతో రెంజల్ సొసైటీ లాభాల బాటలో ఉందని సొసైటీ చైర్మన్ మొయినుద్దీన్ తెలిపారు. బుధవారం సొసైటీ భవనంలో మహాజనసభను సొసైటీ చైర్మన్ మొయినుద్దీన్ అధ్యక్షతన నిర్వహించారు. రుణమాఫీ అయిన రైతులకు తిరిగి కొత్త రుణాలను అందజేసినట్టు ఆయన పేర్కొన్నారు. గత సీజన్లో వరి సెనగకు సంబంధించి ప్రభుత్వం నుంచి రూ.44 లక్షలు రావాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. సొసైటీలో 3831 మంది సభ్యులు ఉండగా, 1,413 మంది రైతులకు రుణమాఫీ రాగా, దాంట్లో కేవలం 536 మందికి రుణమాఫీ వర్తించిందని ఆయన తెలిపారు. సొసైటీకి 20 లక్షల రూపాయల స్టాకు ఎరువుల ద్వారా రావాల్సిందని, నగదు 7 లక్షల రూపాయలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్, పాలకవర్గ సభ్యులు ఆసాని ప్రశాంత్, అగ్గు నారాయణ, పోతరాజు గంగామణి, బుడ్డోళ్ల సాయిలు, పుట్టి సాయిరెడ్డి, ఖదీర్ పాషా, జగన్మోహన్‌రెడ్డి, ఆఇటి చంద్రకళ, మన్నె సావిత్రి, రైతులు టి.అంజయ్య, రఫిక్, సిబ్బంది సాయిబాబా, మురళీ కిషోర్, ఇంతియాజ్, శ్రీనివాస్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అనంత పద్మనాభ స్వామి ఆలయంలో పూజలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలో గల అనంతపద్మనాభ స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్వామివారి చతుర్దశి వేడుకలను పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదానం ఉంటుందని వివరించారు.

కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి

నవతెలంగాణ-విలేకరుల బృందం

మద్నూర్ : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి సర్పంచ్ సురేష్, ఉపసర్పంచ్ విట్టల్, పద్మశాలి సంఘం నాయకులైన శ్రీనివాస్, రచ్చ కుశాల్ సంఘం సభ్యులు నాయకులు కలిసి పూలమాలలతో నివాళులర్పించి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కొండ లక్ష్మణ్ బాపూజీ అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ జయంతి వేడుకల్లో పలువురు పాల్గొన్నారు.



భిక్కనూర్ : బాపూజీ చిత్రపటానికి నివాళి

బిచ్కుంద : ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా బిచ్కుంద మండల కేంద్రంలోని మార్కండేయ మందిరంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాన్సువాడ డివిజన్ పద్మశాలి సంఘం అధ్యక్షులు డాక్టర్ రాజు మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివని ఆయన అందరికీ ఆదర్శప్రాయనీయుడని ఆయన చూపిన మార్గదర్శకంలో నడవాలని ఆయన సేవలను కొనియాడారు. బిచ్కుంద పద్మశాలి సంఘం అధ్యక్షులు గంగుల శ్రీనివాస్, మాలేగాం పరమేష్, బోడ అంజయ్య, కెఆర్పి హన్మాండ్లు, అల్లిసాయిలు, ఎల్కోటి రాజు, షేర్ల లక్ష్మణ్, అందే భూమయ్య, సాయిరాం, పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

భిక్కనూర్ : తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కామారెడ్డి డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ రామకృష్ణ హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో తొలి, మలిదశ ఉద్యమంలో ఆయన పాత్ర ఎనలేనిదని, వారిచ్చిన స్ఫూర్తితోనే తెలంగాణ అభివృద్ధికి పాటుపడాలని అధ్యాపకులకు సూచించారు. యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజేషన్ చేయాలని కోరారు. యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసి యేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్స్ నారాయణ గుప్తా సునీత, రమాదేవి, వైశాలి, సరిత, శ్రీమాతా, శ్రీకాంత్, నిరంజన్ శర్మ దిలీప్ పాల్గొన్నారు.

తాడ్వాయి : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలను కొనియాడారు. ఆయన తెలంగాణ కోసం జీవితాన్ని త్యాగం చేశారని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

2006 అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలి

- **సిపిఐఎంఎల్ ప్రజాపంథా కామారెడ్డి జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ**

నవతెలంగాణ-లింగంపేట్

తెలంగాణ ప్రభుత్వం 2006 అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయకుండా గిరిజన, గిరిజనేతరులను బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలను భయభ్రాంతులకు గురిచేసి అక్రమ కేసులు మోపడం కెసిఆర్ ప్రభుత్వం ఫారెస్ట్ అధికారులను పోడు సాగుదారులపై దాడులు చేస్తుందని సిపిఐఎంఎల్ ప్రజాపంథా కామారెడ్డి జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ దుయ్యబట్టారు. బుధవారం మండలంలోని ఎల్లారం, ఒంటరిపల్లి, మోతే గ్రామాలలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కెసిఆర్ రాష్ట్రంలో 12 లక్షల 5ఎకరాలకు పోడు పట్టాలిస్తారని ప్రకటించి గిరిజనుల్లో కొంతమందికి మాత్రమే పట్టా హక్కు పత్రాలిచ్చి చేతులు దులుపుకున్నారని ఆయన అన్నారు. 2006 అటవీ చట్టాన్ని పేదలకు అమలు చేయకుండా కేసీఆర్ ప్రభుత్వం అన్యాయం చేస్తుందని ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. గిరిజనేతరులైతే 70 సంవత్సరాలుగా అటవీ గ్రామాలలో నివసిస్తున్న వారికి చట్టం వర్తిస్తుంది కదా ఈ విషయం కెసిఆర్ ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. అటవీ చట్టం విషయంలో సుప్రీంకోర్టు, ఐక్యరాజ్యసమితి చెప్పిన విషయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టడం శోచనీయమని అన్నారు. మూడో దశ అధికారం కోసం కేసీఆర్ తహతహలాడుతూ కామారెడ్డిలో ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి వస్తున్న సందర్భంగా కెసిఆర్‌కు పేదోళ్ల సూటి ప్రశ్న అనే డిమాండ్‌తో అక్టోబర్ ఐదున చలో కామారెడ్డి కార్యక్రమానికి ప్రజాపంథా పిలుపునందుకొని పోడు సాగుదారులందరూ కదలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కెసిఆర్‌కు చట్టం విషయాన్ని తెలిపి జ్ఞానోదయాన్ని తెద్దామని ఆయన అన్నారు. ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు హామీలు ప్రణాళికలు చేసినవి ఏవి సంపూర్ణంగా అమలు కాలేదని అందులో భాగంగానే నియోజకవర్గానికి గృహలక్ష్మి పథకాన్ని 3000 మాత్రమే ఇస్తామనడం విడ్డూరమని అన్నారు. మిగతావారు ఏ చెట్ల కింద తల దాచుకోవాలని అన్నారు. కామారెడ్డిలో ఎమ్మెల్యే పోటీముందే నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, బీడీ కార్మికులందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా 4వేల జీవనభృతి ఇవ్వాలని ప్రభుత్వ హామీలను అమలు చేయాలని అప్పుడు మాత్రమే కేసీఆర్ పై విశ్వాసం కుదురుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రజాపంథా పార్టీ నాయకులు పి బాలరాజ్, పరమేష్, గుండారం సాయరెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గణనాథుల శోభాయాత్ర

నవతెలంగాణ-విలేకరుల బృందం

సదాశివనగర్ : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం గణపతుల శోభయాత్ర నిర్వహించారు. వయస్సుతో సంబంధం లేకుండా శోభయాత్రలో పాల్గొన్నారు. డి.జె.ల పాటలతో నృత్యాలు చేస్తూ శోభయాత్ర నిర్వహించారు. గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా శోభయాత్రను చేపట్టారు. అనంతరం గ్రామ సమీ పంలోని చెరువులు, కుంటలలో నిమజ్జనం చేశారు. మండలంలోని యాచారం, లక్ష్మీనాయక్ తండా, పూర్యానాయక్ తండా, సజ్జనాయక్ తండా, వజ్జపల్లి తండా సదాశివనగర్ తదితర గ్రామాల్లో నిమజ్జనం చేశారు.

రామారెడ్డి : మండలంలో మద్దికుంట, రామారెడ్డి, రెడ్డిపేట్ తదితర గ్రామాల్లో బుధవారం గణేష్ శోభయాత్రను నిర్వహించారు. భజనలు, కోలాటం, డీజేలా శబ్దాలతో యువకుల నృత్యాలతో శోభయాత్ర కొనసాగింది. గ్రామ ఊర చెరువుల్లో గణేష్ నిమజ్జనాన్ని నిర్వహించారు.

తాడ్వాయి : మండల కేంద్రంలో బుధవారం గణనాథుల నిమజ్జోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అందంగా అలంకరించిన వాహనాలలో గణనాథులను ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా గణనాథులను ఊరేగించి అనంతరం స్థానిక శబరిమాత కుంటలో గణనాథులను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యువకులు నిర్వహించిన పాటలు నృత్యాలు అందరినీ అలరించాయి.

వైభవంగా గణేష్ శోభాయాత్ర..

గాంధారి : మండల కేంద్రంలో వినాయక నిమజ్జన శోభాయాత్ర కొనసాగుతోంది. మంగళవారం రాత్రి ప్రారంభమైన గణేష్ శోభాయాత్ర బుధవారం గాంధారి మండల కేంద్రంలోని ప్రధాన వీధులు గుండా కొనసాగింది. మండల కేంద్రంలో సుమారు 60 గణనాథులను నెలకొల్పారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులు వివిధ శాఖల అధికారులు సంయుక్తంగా అన్ని ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రలో ఈ సారి భారీ గణనాథుల విగ్రహాలను నెలకొల్పారు. వివిధ గణేష్ మండలి వారు గణేష్ రథాలకు చేసిన అలంకరణ మండల ప్రజలను అమితంగా ఆకట్టుకున్నాయి. మండల కేంద్రంలోని పదవ తరగతి 1993-94 బ్యాచ్ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. వేలాది మంది భక్తులకు అన్నదానం సౌకర్యం కల్పించారు. అలాగే మండలంలోని సీతాయిపల్లి, చిన్న పోతాంగల్ గ్రామంలో గణేష్ మండపాల వద్ద అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.



గాంధారిలో నిమజ్జనానికి తరలిన భారీ వినాయకుడు

ఎండీఎం కార్మికులకు పెంచిన వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-పిట్లం

వంట కార్మికులకు పెంచిన వేతనాలు చెల్లించాలని వంట కార్మికుల మండల అధ్యక్షురాలు నీలా భాయ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2023 వంట కార్మికులకు పెంచిన వేతనాలు, అసెంబ్లీలో ప్రకటించిన ఏరియర్స్, పెండింగ్ బిల్లులు, వేతనాలు, కోడిగుడ్ల బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వంట కార్మికుల అక్రమ తొలగింపులను ఆపాలని కోరారు. కార్మికులకు నియామకపత్రాలు అందించి, గుర్తింపు కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. కొత్త మెనూ ప్రకారం వంట చేయాలంటే 25 రూపాయల స్లాబ్ రేటు ప్రకటించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వంట కార్మికుల మండల ఉపాధ్యక్షులు బాల్‌రాజ్, స్వరూప, ఆయా గ్రామాల వంట కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ముఖ గుర్తింపు హాజరు ప్రారంభం

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచడానికి తీసుకున్న చర్యలో భాగంగా ప్రతి పాఠశాలలో విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరును ప్రారంభించింది. దాంతో పాఠశాలల్లో రిజిస్టర్‌లో హాజరుతో పాటు సంబంధిత తరగతి ఉపాధ్యాయులు విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరును సెల్‌ఫోన్ ద్వారా తీసుకుంటున్నారు. తద్వారా విద్యార్థులు హాజరు ఖచ్చితంగా తెలుస్తుందని ఉపాధ్యాయులు తెలిపారు. దీనివలన ఆరోజు ఎంతమంది పిల్లలు హాజరయ్యారు, ఎంతమంది గైర్హాజరు అయ్యారనే విధానం సంబంధిత ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉందని ఉపాధ్యాయులు తెలిపారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ముఖ గుర్తింపు హాజరు విధానం ద్వారా మధ్యాహ్న భోజన పథకంలో జరిగే అవకతవకలకు చెక్ పెట్టే అవకాశం వచ్చింది.

బీఆర్ఎస్‌లో చేరిన బీసీ కాలనీ యువకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బిసి కాలనీ యువకులు బుధవారం కాంగ్రెస్ పార్టీని వీడి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, ఇమ్రాన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బిసి కాలనీ యువకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే జాజాల సురేందర్ చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే జాజాల సురేందర్ మాట్లాడుతూ.. పార్టీ కోసం ప్రతి ఒక్కరు కష్టపడాలని సూచించారు. యువకులు పాషా, అంబు, శివ, గౌస్, సందీప్, ఇర్ఫాన్, మోసిన్, జుబేర్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌తోనే నియోజకవర్గ అభివృద్ధి

నవతెలంగాణ-దోమకొండ

కామారెడ్డి నియోజకవర్గం అభివృద్ధి కోసం అనేక నిధులు కేటాయించి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ అన్నారు. మండల కేంద్రంలోని నూతనంగా నిర్మించిన రూ.40లక్షలతో చేపట్టిన సొసైటీ భవనం, 3కోట్ల 15 లక్షలతో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను, మన ఊరు మన బడి పథకంలో చేపట్టిన కోటి 60 లక్షలతో పాఠశాలలో భవనం నిర్మాణం, అదనపు గదులు, వీటితో పాటు గ్రామంలోని వివిధ కుల సంఘాలకు కమ్యూనిటీ భవనం నిర్మాణం పనులు, పలు ఆలయాల అభివృద్ధి పనులు, గ్రామంలో 10కోట్ల 60 లక్షలతో పలు అభివృద్ధి పనులను బుధవారం ప్రారంభిం చేశారు. జిల్లా గ్రంథాలయం చైర్మన్ పున్న రాజేశ్వర్, జడ్పీ వైస్‌చైర్మన్ ప్రేమ్‌కుమార్, ఎంపీపీ శారద, జడ్పిటిసి తిరుమలగౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంద్ర మధుసూదన్ రావు, సర్పంచు అంజలి శ్రీనివాస్, రైతుబంధు మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, విండో చైర్మన్ నాగరాజు, ఎంపీటీసీలు రమేష్, శంకర్, ఉప సర్పంచ్ శ్రీకాంత్ నాయకులు అధికారులు కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని పాదయాత్ర

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తెలంగాణ యూనివర్సిటీ నుండి డిచ్ పల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్ర చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు బట్టు సురేష్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని అమలు చేసి యూనివర్సిటీలో పని చేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. లేకపోతే వచ్చేనెల ఏడవ తేదీ నుండి నిరవధిక సమ్మె చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్న, కార్యదర్శి శివ, యూనివర్సిటీ కార్యదర్శి బికోజీ, రామకృష్ణ, నరేష్, దిగంబర్, సతీష్, సుధీర్, ప్రేమ్ కుమార్, తిరుపతి, గంగాధర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

చేపల పెంపకంపై అవగాహన

నవతెలంగాణ-బాల్కొండ



మండల కేంద్రంలోని మహిళా సహకార సమాఖ్య కార్యాలయంలో బుధవారం ఉదయ్ ఆక్వా కనెక్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చేపల పెంపకంపై, చేపల మార్కెటింగ్‌పై ఉమ్మడి బాల్కొండ మండలానికి సంబంధించిన సీఏలు, సీసీలు, ఏపిఎం లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిపిఎం మారుతి, ఉదయ ఆక్వా కనెక్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సభ్యులు భాగ్యలక్ష్మి, బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల ఏపిఎంలు గంగాధర్ పుప్పాల, ప్రసాదరావు, విక్రమ్ రెడ్డి ,సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

తెలంగాణ బాగు కోరేది కేసీఆర్ ఒక్కడే

- కాంగ్రెస్,బీజేపీ మభ్యపెట్టే మాటలు నమ్మొద్దు
- రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



శిలాఫలకం ప్రారంభిస్తున్న మంత్రి వేముల

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తెలంగాణ బాగు కోరేది కేసిఆర్ ఒక్కడే...కేసిఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష, కాంగ్రెస్, బీజేపీ హామీలు నమ్మితే మోసపోతమని, కాంగ్రెస్, బీజేపీ మభ్యపెట్టే మాటలు నమ్మొద్దని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు బుధవారం మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్, బీజేపీ ఏరు దాటాక..తెప్ప తగలబెట్టే రకమని, ఓట్ల కోసం ఎంతటి అబద్దాలైన చెప్తారని అన్నారు. ఓట్లు డబ్బాల పడ్డాక, మొహం కూడా చూపించరన్నారు. కాంగ్రెస్, బీజేపీ హామీలు నమ్మితే మోసపోతామని అన్నారు. తెలంగాణ బాగు కోరేది కేసిఆర్ ఒక్కడే అని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు హైకమాండ్ ఢిల్లీలో ఉంటే,కేసిఆర్ కు తెలంగాణ ప్రజలే హైకమండ్ అన్నారు. కేసిఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష అని స్పష్టం చేశారు. ఈ 9ఏళ్లలో కమ్మర్ పల్లి అభివృద్ధి కోసం రూ.90 కోట్లు ఖర్చు చేశామని, హాసకొత్తూరు అభివృద్ధి కోసం రూ. 43 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. చౌట్ పల్లి హన్మంతు రెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఇప్పుడు 24 గంటలు కరెంట్ తో ఏడాదిలో 8నెలలు నడుస్తోందన్నారు. అంతకుముందు మంత్రికి ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి నీరాజనం పలికారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.

మండల కేంద్రంలో రూ.20 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణానికి, రూ.50 లక్షలతో కమ్మర్ పల్లి నుండి తడపాకల్ వెళ్లే రోడ్డులో వరద కాలువ వద్ద స్లాబ్ కల్వర్టు పనులకు, రూ.25లక్షలతో సింగల్ విండో కార్యాలయం వద్ద గోడౌన్ నిర్మాణానికి, రూ.50లక్షలతో మండల కేంద్ర శివారులోని గాంధీనగర్- నాగపూర్ గ్రామాల మధ్య రోడ్డు పై స్లాబ్ కల్వర్టు పనులకు శంకుస్థాపన చేశారు. హాసకొత్తూరు గ్రామంలో రూ.80లక్షలతో హాసకొత్తూర్ నుండి జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం మెట్ల చిట్టాపూర్ బిటి రోడ్ పనులకు, రూ.6లక్షలతో గ్రామంలో సింగిల్ విండో గోడౌన్ నిర్మాణ పనులకు మంత్రి ప్రశాంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఆర్డీవో వినోద్ కుమార్, ఆర్మూర్ ఏసిపి జగదీష్ చందర్, రైతు రాష్ట్ర నాయకులు కోటపాటి నరసింహనాయుడు, రాష్ట్ర నాయకులు భాస్కర్ యాదవ్, బద్దం చిన్నారెడ్డి, ఎంపీపీ అధ్యక్షురాలు గౌతమి, జడ్పిటిసి సభ్యురాలు రాధా రాజా గౌడ్, సర్పంచ్ కు గడ్డం స్వామి, ఏనుగు పద్మ రాజేశ్వర్, ఎంపీటీసీ లు మైలారం సుధాకర్, నోముల రజిత, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, గ్రామ శాఖ అధ్యక్షులు చింత గణేష్, తెడ్డు కిరీటి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా సీనియర్ సాఫ్ట్ బాల్ మహిళల ప్రాబబుల్స్ జట్టు ఎంపిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని సాంఘిక సంక్షేమ కళాశాల సుద్దపల్లి క్రీడా మైదానంలో జిల్లా సీనియర్ మహిళల 25మంది ప్రాబబుల్స్ జట్టును బుధవారం ఎంపిక చేసినట్లు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్ తెలిపారు.ఎంపికైన ప్రబబుల్స్ జట్టుకు శిక్షణ శిబిరం నిర్వహించి తుది జట్టును ఎంపిక చేసి అక్టోబర్ రెండో వారంలో జరిగే సీనియర్ రాష్ట్ర సాఫ్ట్ బాల్ పోటీలకు పంపనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయిమ ఉపాధ్యాయులు నల్లూరి లత, స్వప్న, సంధ్య, సాఫ్ట్ బాల్ అకాడమీ కోచ్ వేముల మౌనిక పాల్గొన్నారు.

హిందూ, ముస్లింలు రెండు రెండు కళ్లు

- మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట
- ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- రూ 5 కోట్ల విలువ గల ప్రొసీడింగ్, షాదిముబారక్ పత్రాల అందజేత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి/మోపాల్

హిందూ ముస్లింలు రెండు కళ్ళలాంటి వారని, మైనార్టీలకు కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా వాడుకుందని, బిజెపి మత రాజకీయాలు చేస్తుందని,

ముస్లింలకు ఎంత చేసిన తక్కువేనని, మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. రూ 5 కోట్ల విలువ గల ప్రొసీడింగ్, షాదిముబారక్, మైనార్టీ కార్పొరేషన్ నుండి మంజూరైన చెక్కులను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అందజేశారు. మిలాద్ ఉన్ నబీ ని పురస్కరించుకుని ముస్లిం లందరికీ శుభాకాంక్షలు తెలిపారు. నియోజవర్గవ్యాప్తంగా మైనార్టీలకు వంద శాతం సబ్సిడీతో మంజూరైన రూ.లక్ష ఆర్థికసాయం అందజేయడం అభినందనీయమని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లింలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా, విద్యాపరంగా ఆత్మగౌరవంతో బతికేవిధంగా సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలుచేశారన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం లో5 కోట్ల రూపాయలు విలువగల ప్రోసిడింగ్ ఆర్డర్స్ పత్రాలను పంపిణీ చేశారు. మసీదుల్లో మౌజన్లకు, ఇమామ్లకు గౌరవేతనం ఇస్తున్నామన్నారు. 'మైనార్టీ బంధు' పథకం ద్వారా ప్రభుత్వం రూ.లక్ష ఆర్థికసాయం అందజేస్తూ అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో యువ నాయకులు, ఒలింపిక్ జిల్లా ఉపాధ్యక్షులు, ధర్పల్లి జడ్పీ టీసి బాజిరెడ్డి జగన్ మోహన్, నూడ చైర్మన్ ఈగ సంజీవ్ రెడ్డి, ఐడిసిఎంఎస్ చైర్మన్ సాంబార్ మోహన్, ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్,కో ఆప్షన్ సభ్యులు షేక్ నయీమ్ షేక్ హుస్సేన్, బుల్లెట్ అక్బర్ ఖాన్, అబ్దుల్ మాజిద్,యువ నాయకుడు మోహమ్మద్ నజీర్, జడ్పిటిసిలు, ఎంపీపీలు, మండల అధ్యక్షులు, మండలాల మైనార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

30జతల క్రీడాదుస్తులు పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని మగ్గిడి గ్రామానికి చెందిన అబ్బగోని ధర్మేందర్‌గౌడ్ పాఠశాల క్రీడా మైదానంలో క్రీడాకారులకు 15 వేల రూపాయల విలువగల 30 జతల క్రీడా దుస్తులు ప్రధానోపధ్యాయురాలు హరిత చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు వ్యాయామ ఉపాధ్యాయులు మధు పాల్గొన్నారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్షల షెడ్యూలు విడుదల

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ లో వివిధ సబ్జెక్టులలో ప్రీ పిహెచ్డి ఎగ్జామ్స్ ఈ క్రింద ప్రకటించిన తేదీలలో జరుగుతాయని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎంఅరుణ పేర్కొన్నారు. అక్టోబర్ 05న అన్ని సబ్జెక్టులలోని రీసెర్చ్ మెథడాలజీ, అక్టోబర్ 6న సంబంధిత ఎంచుకున్న సబ్జెక్టు, అక్టోబర్ 7న రీసర్చ్ పబ్లికేషన్ ఎథిక్స్ పరీక్షలు ఉదయం 10 గంటల నుండి ప జరుగుతాయని ప్రొఫెసర్ ఎం అరుణ తెలిపారు.పూర్తి వివరాలకు www. telanganauniversity. ac.in ని సంప్రదించాలని సూచించారు.

ఉద్యోగ, కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- కార్మిక సంఘాల డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కార్మిక సంఘాల రాష్ట్ర జేఏసీ కన్వీనర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జంగం గంగాధర్, ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షులు వెంకటి, టీజీ కేసు జిల్లా అధ్యక్షులు గుర్రపు రాజేశ్వర్ అన్నారు. బుధవారం నిజామాబాద్ కలెక్టరేట్ వద్ద భారీ ప్రదర్శన నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలని 34 రోజులు సమ్మె చేస్తే రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి మోసం చేయడంతో తిరిగి ఆందోళన చేయాలని రాష్ట్ర జేఏసీ పిలుపునిచ్చిందని తెలిపారు. పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలని, పర్మినెంట్ చేయాలని, కారోబార్లకు ప్రత్యేక హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, ఉద్యోగ కార్మికులందరికీ పిఎఫ్, ఈఎస్ఐ చట్టాలను అమలు చేయాలని, ప్రభుత్వ గ్రాంట్ ద్వారానే వేతనాలు అందించాలని వారు డిమాండ్ చేశారు. సమ్మె విరమించి 45 రోజులు గడిచిన ప్రభుత్వం ఇచ్చిన మాట అమలు చేయకపోవడంతో ఆందోళన చేయాల్సి వస్తుందని వారు గుర్తు చేశారు. కేవలం 5 లక్షల బీమా, పంచాయతీ కార్మికుల దహన సంస్కారాలకు 10వేలు ఇవ్వాలని సర్క్యులర్ పంపి చేతులు దులుపుకుంటే సరిపోదని వారు అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి లేకుంటే అక్టోబర్ 5న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు నాయకులు సాగర్, ఐఎఫ్టియు నాయకులు జేపీ గంగాధర్, శివకుమార్, రమేష్, టిజికేఎస్‌యు శ్రీపాద బాలయ్య పాల్గొని ప్రసంగించారు. ఐఎఫ్‌టియు నాయకులుభూమయ్య, జెల్లా మురళి, బి మల్లేష్, అబ్దుల్, సొప్పరి గంగాధర్, కోటగిరి సుధాకర్, సత్యక్క, ఆలూరు పోసెట్టి, రాంపూర్ పోసాని భారతి,తదితరులు పాల్గొన్నారు.

పోచంపాడ్ ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ

- సుమారు పది లక్షల రూపాయలు అపహరణ
- ఐరన్ రాడ్లు , గ్యాస్ కట్టర్లు వినియోగించిన దుండగులు
- క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ లతో గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు
- చోరికి ఉపయోగించిన వ్యాగనార్ కారు గుర్తింపు



క్లూస్‌టీం, జాగిలంతో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-మెండోర

మండలంలోని పోచంపాడ్ చౌరస్తా ఎన్ హెచ్ 44 జాతీయ రహదారి ప్రధాన కూడలి సమీపంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం బుధవారం తెల్లవారు జామున చోరికి గురైంది. జులాయి సినిమాలో బ్యాంక్ దొంగతనం సన్నివేశాన్ని తలపించేలా ఆగంతకులు షట్టర్ ఐరన్ రాడ్లతో పైకిలేపి లోనికి ప్రవేశించి ఏటీఎంను గ్యాస్ కట్టర్‌తో కట్‌చేసి నగదును దోచుకెళ్లారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ జయరామ్ మీడియాతో మాట్లాడుతూ... బ్యాంకు అధికారుల సమాచారం మేరకు ఎటిఎంలో సుమారు పది లక్షల రూపాయలు చోరికి గురి అయినట్లు తెలిపారు. దుండగులు ఏటిఎం దగ్గర బిగించిన సిసి కెమెరాలకు నల్లటి రంగు స్ప్రే చేసి దొంగతనానికి పాల్పడ్డారని తెలిపారు. సీసీ కెమెరాలకు స్ప్రే చేయగానే అలారం మోగిన వెంటనే మంగళవారం ఉదయం తెల్లవారు జామున సుమారు 3 గంటల 18 నిమిషాలకు సర్వే లైన్స్ టీం ద్వారా బ్యాంకు అధికారులకు సమాచారం అందించారన్నారు. వెంటనే ఎస్సై జి.శ్రీనివాస్ యాదవ్‌కు తెలపడంతో ఘటన స్థలానికి చేరుకొని చూడగా అప్పటికే దుండగులు పారిపోయినట్లు ఎస్సై తెలిపారు. క్లూస్ టీం సహాయంతో వేలిముద్రలు సేకరించామని, డాగ్ స్క్వాడ్ బృందం ద్వార పరిశీలిస్తున్నామని అన్నారు. అంతర్రాష్ట్ర బ్యాంకు దొంగల ముఠానే ఈ రాబరీకి పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. బ్యాంకు చోరీకి పాల్పడిన ముఠా కోసం పోలీసు శాఖ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టిందని అదనపు కమిషనర్ ఆఫ్ పోలీస్ జయరాం తెలిపారు.ఘటనా స్థలాన్ని ఆర్మూర్ ఎసిపి జగదీష్ చందర్ , ఆర్మూర్ రూరల్ సిఐ గోవర్ధన్ రెడ్డిలు సందర్శించారు.

చోరికి వినియోగించిన వాహనం గుర్తింపు

బుధవారం రోజున తెల్లవారు జామున 3 గం"ల ప్రాంతంలో పోచంపాడ్ ఎక్స్‌రోడ్డు వద్ద గల ఎస్బిఐ బ్యాంక్ ఎటిఎం చోరీలో వాడిన ఏపీ 25ఎల్ 9023 నెంబర్‌గల సిల్వర్ కలర్ కలిగిన వ్యాగనార్ కారుగా పోలీసులు గుర్తించారు. ఈ వాహనం కనిపిస్తే ఆర్మూర్ రూరల్ సిఐ 8712659859, మెండోర ఎస్ఐ 8712659864 , ఆర్మూర్ ఏసీపీ 8712659808 నెంబర్లకు గానీ డయల్ 100 కు గానీ సమాచారం అందించాలని ఎస్ఐ శ్రీనివాస్ యాదవ్ కోరారు.

1న బంజారా భవన నిర్మాణకోసం

- మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు రాక
- విజయ వంతం చేయాలని బంజారాలకు పిలుపు
- ఎంపీపీ బాదవత్ రమేష్‌నాయక్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

జిల్లా కేంద్రంలో దాదాపు 8కోట్ల పై చిలుకు నిధులతో చేపట్టే బంజారా భవనం నిర్మాణంకోసం మంత్రులు సత్యవతి రాథోడ్, ప్రశాంత్ రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వస్తున్నారని ఇందల్‌వాయి ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్ అన్నారు.బుధవారం ఇందల్‌వాయి మండల కేంద్రంలో గిరిజన ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్ మాట్లాడుతూ.. 20ఏళ్ల క్రితం గిరిజనులు ప్రతి తండానుండి డబ్బులు పోగు చేసుకుని జిల్లా కేంద్రంలో బంజారా భవన్ నిర్మాణం కోసం భూమ కొనుగోలు చేశారని తెలిపారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మంత్రి ప్రశాంత్‌రెడ్డి సహకారంతో 3 కోట్ల 10 లక్షల రూపాయలను మంజూరు చేయించారన్నారు. అక్టోబర్ 1న జరిగే ఈ అధికారిక కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలకు చెందిన నాయకులు అధికారులు పాల్గొంటారని వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న గిరిజనులు సేవాలాల్ రామారావు మహారాజ్ భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నిధులు ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రత్యేక కృషితోనే సాధ్యమైందని ఆయన అన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు మోహన్ నాయక్, పరశురాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా ఇట్టెం గోపాల్



నియామకపత్రం అందజేస్తున్న జిల్లా నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

పీఆర్‌టీయూ జిల్లా క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా ఇట్టెం గోపాల్‌ను నియమించినట్టు బుధవారం తెలిపారు. 13 సంవత్సరాలుగా ఆర్మూర్ మండల అర్బన్ రూరల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా కొనసాగుతూ క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా నాయకుడిగా ఉంటూ సంఘ అభివృద్ధిలో తన వంతు కృషి చేస్తున్న కృషికి గుర్తించారని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ రావు ఆదేశానుసారం జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ గౌడ్, గోపాల్ నియామక పత్రాన్ని అందజేశారు. పిఆర్‌టియూ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రబాబు నాయుడు మీద బురద జల్లేందుకు అరెస్టులు

- రాష్ట్ర మాజీ అధ్యక్షులు, పోలిట్ బ్యూరో సభ్యులు బక్కిని నర్సింలు
- టీడీపీ రిలే నిరాహార దీక్ష

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



దీక్షలో కూర్చున్న టీడీపీ నాయకులు

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేశారని తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, పోలిట్ బ్యూరో సభ్యులు బక్కిని నర్సింలు అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదాగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. మొదటగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారని తెలిపారు. అనంతరం నిరాహార దీక్షకు కూర్చున్న వారికి పూలమాలలు వేసి ప్రారంభించారు. ఈసందర్భంగా బక్కినీ నర్సింలు మాట్లాడుతూ..సైకో జగన్ తను చేసిన అక్రమాలను అవినీతిని కప్పిపుచ్చుకుంటూ కక్షపూరితంగా చంద్రబాబు నాయుడు మీద బురద జల్లాలని దురుద్దేశంతో వ్యవస్థలను అడ్డుపెట్టుకొని అరెస్టు చేయించారన్నారు. అవినీతి మరకలు పూయాలని స్కిల్ డెవలప్మెంట్ 2021లో ముగిసిన కేసులో తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపించారని తెలిపారు. ప్రపంచ నలుమూలలో ఉన్న తెలుగు ప్రజానీకం ఆందోళన బాట పట్టారని, కానీ కల్వకుంట్ల తారక రామారావు పక్క రాష్ట్రంలో జరిగిన సంఘటనకు ఇక్కడ నిరసనలు చేయవద్దని అనడం సబబు కాదని మండిపడ్డారు. కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఇంచార్జ్ కర్రే వినోద్ కుమార్, జగిత్యాల నియోజకవర్గ ఇన్చార్జ్ మహంకాళి రాజన్న, బోధన్ నియోజకవర్గ ఇన్చార్జ్ కోట గోపాల్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఇన్చార్జ్ నాగేశ్వరరావు, కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జ్ మానుక ప్రవీణ్, బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జ్ రాజన్న, పార్లమెంట్ కమిటీ నాయకులు జనరల్ సెక్రెటరీ రేంజర్ల సురేష్, పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షులు హనుమంతరావు, కార్యనిర్వాహక కార్యదర్శి జ్యోతి రాష్ట్ర అనుబంధ సంఘ నాయకులు పాల్గొన్నారు.

సబ్బండవర్గాలకోసం పోరాడిన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ

- ఘనంగా నివాళ్లు అర్పించిన సీపీ, పద్మశాలి సంఘం, ఇతర సంఘాల నాయకులు

నవతెలంగాణ-విలేకరులు

కంఠేశ్వర్: నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ కమీషనరేటు కార్యాలయంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ వి. సత్యనారాయణ, కొండా లక్ష్మణ్ బాపూజీ ఫొటోకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. సకల జనులు, సబ్బండవర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలని జీవితాంతం పోరాడారని అన్నారు. సాయుధ పోరాట కాలంలో పెత్తందార్లను ఎదిరించిన వారికి న్యాయవాదిగా సేవలందించారన్నారు. కార్యక్రమంలో అదనపు డిసిపి (ఎఆర్) గిరిరాజు, ఎ.ఓ శ్రీనివాస్, హెూమ్ గార్డు ఏసిపి అరుణ్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం, రిజర్వు ఇన్‌స్పెక్టర్స్, ఆఫీస్ సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కంఠేశ్వర్: స్వాతంత్ర్య సమరయోదుడు కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా నిజామాబాద్ లో వినాయక నగర్ లోని ఆయన విగ్రహానికి మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ కృతం గంగారెడ్డి, జిల్లా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు వేణు రాజ్, బాల్కొండ మండల కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, కమ్మర్పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు రవి, భీంగల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు స్వామి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అడెం గంగ ప్రసాద్ పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: ఇందల్ వాయి, డిచ్ పల్లి మండల కేంద్రలతో పాటు గ్రామాల్లో కొండాలక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ పద్మశాలి అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు కోండియ్యల్ భాస్కర్, మారుతి, సుధాకర్, రాజేందర్, రాజారాం, కిషన్ పాల్గొన్నారు.

బాల్కొండ: మండల కేంద్రంలోనీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ చిన్నయ్య ఆధ్వర్యంలో కొండాలక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించారు. ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ గంగారాం,ల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జక్రాన్ పల్లి: తెలంగాణ కోసం తన మంత్రి పదవికి కొండ లక్ష్మణ్ బాపూజీ రాజీనామా చేశారన్లి మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు శ్రీపతి శేఖర్ అన్నారు.కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతిని మండలంలోని బ్రాహ్మణపల్లిలో పద్మశాలి సంఘంలో నిర్వహించారు. సతీష్ సాయిలు గంగాధర్ రాజేందర్ పంచాక్షరి నరేష్ కిషన్ గంగాధర్ పాల్గొన్నారు.

మండలకేంద్రంలో పద్మశాలీ పెద్ద సంఘంలో నిర్వహించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిలో సంఘ నాయకులు సోమరాజు, కన్నేపల్లి ప్రసాద్, బొద్దుల చక్రపాణి, పెండ్యాల రమేష్, జ్ఞానేశ్వర్, సంఘసభ్యులు,మహిళ సభ్యులు పాల్గొన్నారు.



కంఠేశ్వర్ : మాట్లాడుతున్న సీపీ సత్యనారాయణ

నవీపేట్: మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆచార్య కొండ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పద్మశాలి పట్టణ అధ్యక్షులు మేక లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి గణేష్, కోశాధికారి ఆడెపు లక్ష్మణ్, మండల అధ్యక్షులు లోకం నర్సయ్య, శివరాం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.